మా కలం.. మీ వజ్రాయుధం..

APTEL 2022 / 16169

# టుడే పల్లె సాక్షి

తెలుగు దిన పత్రిక

pallesakshi2022@gmail.com

youtub : pallesakshi news



**విలేకరులు కావలెను**

పెన్ సాక్షి...న్యూస్ ఛానెల్,మరియు టుడే పల్లెసాక్షి తెలుగు దిన పత్రికకు విలేకరులు కావలెను...

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వెలువబడుతున్న జిల్లా (స్టాపర్లు) (బ్యూరోలు) నియోజకవర్గం,మరియు మండల కేంద్రంలో పనిచేయుటకు ఆసక్తి ఉన్న విలేకరులు కావలెను.. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వబడును...

వి. లింగమూర్తి

ఎడిటర్ . కర్నూలు జిల్లా

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

సెల్...9000367833

సెల్...8074937223

PUBLISHED FROM : AMARAVATHI, VIJAYAWADA, HYD, KURNOOL, NANDYALA, KADAPA, ANANTAPUR, CHITOOR, ALL DISTRICTS IN ANDHRA PRADESH & TELANGANA

కర్నూలు : ఎడిటర్ : వి.లింగమూర్తి | సంపుటి : 5 సంచిక : 67 | పేజీలు : 8 | వెల రూ.4/- | email : pallesakshi2022@gmail.com | మంగళవారం 04-08-2026

## కామన్వెల్త్ గేమ్స్..
# ఏకంగా 8 స్వర్ణాలు..

**భారత్ పతక వేటలో మహిళలదే ఆధిపత్యం**

కామన్వెల్త్ గేమ్స్ 2026 సంగ్రామం ముగిసింది

- గ్లాస్గో వేదికపై భారత మహిళా అథ్లెట్లు అద్భుతం చేశారు
- గ్లాస్గో భారత మహిళలు బంగారు పతకాలతో తళుక్కుమన్నారు
- వీరి ప్రయాణమేమీ అంత సులభంగా సాగలేదు
- కలల ప్రపంచాన్ని కళ్ల ముందుకు రప్పించుకున్న మహిళల విజయగాథ!
- ఈ అథ్లెట్ల ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తి...

కామన్వెల్త్ గేమ్స్ 2026 సంగ్రామం ముగిసింది. గ్లాస్గో వేదికపై భారత మహిళా అథ్లెట్లు అద్భుతం చేశారు. 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలతో మొత్తంగా 39 పతకాలు సాధించిన భారత్.. పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. అయితే భారత్ సాధించిన 13 స్వర్ణాల్లో 8 గోల్డ్ మెడల్స్ మహిళా అథ్లెట్ల ఖాతాలోనే చేరడం విశేషం. అంతర్జాతీయ వేదికపై జాతీయ గీతం మార్మోగిన ప్రతిసారీ పతక పోడియాలపై మహిళలే ఎక్కువగా కనిపించారు. వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, జుడో, పారా అథ్లెటిక్స్.. ఇలా విభిన్న విభాగాల్లో భారత మహిళలు సత్తా చాటి దేశానికి గర్వకారణంగా నిలిచారు.వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయ్ చాను, జుడోలో అస్మితా డే, పారా అథ్లెటిక్స్‌లో షర్మిలా, బాక్సింగ్‌లో ప్రీతి పవార్,




జైస్మిన్ లాంబోరియా సాక్షి చౌదరి, ప్రియా ఘంఘాస్, అరుంధతీ చౌదరి.. ఇలా గ్లాస్గో భారత మహిళలు బంగారు పతకాలతో తళుక్కుమన్నారు. అయితే వీరి ప్రయాణమేమీ అంత సులభంగా సాగలేదు. ఎన్నో ఒడిదొడుకులు, విమర్శలు అన్నింటినీ ఎదుర్కొని అంతర్జాతీయ స్థాయి వరకు ఎదిగారు. ప్రీతి పవార్ రెజ్లింగ్ నేపథ్యం ఉన్న

..2వ పేజీలో

## ఉక్రెయిన్ యుద్ధం తర్వాత..
## రికార్డు స్థాయిలో రష్యా చమురు..
# దిగుమతులు..!!

**ఇంత భారీ స్థాయిలో దిగుమతి చేసుకోవడం ఇదే మొదటిసారి**

- జులైలో భారత్ ప్రపంచ దేశాల నుంచి రోజుకు 5 మిలియన్ బ్యారెళ్లకు పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంది
- దేశ ముడి చమురు దిగుమతులలో రష్యా వాటా 55.5 శాతానికి చేరింది
- దిగుమతులు పెరగడానికి రష్యా చమురు నిరంతరం అందుబాటులో ఉండడమే
- జులైలో దిగుమతి చేసుకున్న మొత్తం 1.2 మిలియన్ టన్నులకు పైగా
- ఎల్‌పీజీలో సుమారు 73శాతం అగ్రరాజ్యం నుంచే కొనుగోలు చేసింది





జులైలో రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు రికార్డు గరిష్ఠానికి చేరాయి. హర్మూజ్‌లో పరిస్థితులు మెరుగుపడడంతో పశ్చిమాసియా దేశాల నుంచి చమురు సరఫరా చేసుకుంటున్నప్పటికీ.. రష్యా నుంచి కూడా జులైలో దిగుమతులు రోజుకు 2.8 మిలియన్ బ్యారెళ్ల (mbd) స్థాయికి చేరుకున్నాయి. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇంత భారీ స్థాయిలో దిగుమతి చేసుకోవడం ఇదే మొదటిసారి. షిప్ ట్రాకింగ్ సంస్థ కెప్లర్ ప్రకారం.. జులైలో భారత్ ప్రపంచ దేశాల నుంచి రోజుకు 5 మిలియన్ బ్యారెళ్లకు పైగా

..2వ పేజీలో



## ఇకపై జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు, నిరసనలు
# బంద్..!!

- సుప్రీంకోర్టులో జరిగిన కీలక విచారణ
- నిరసనల కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి
- నిత్యావసర వస్తువుల సరఫరాకు, వైద్య సేవలకు ఆటంకం కలుగుతోంది
- ధర్నాలు, ఆందోళనలు నిర్వహించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

..2లో..



# ఉప్పొంగుతున్న గో'దారి'..!!

**లంక గ్రామాల పరిస్థితి ఇదే..**

- తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో గోదావరి ఉప్పొంగుతోంది
- లంక గ్రామాలను ముంచెత్తుతోంది..ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు
- కృష్ణమ్మ కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

2

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో గోదావరి ఉప్పొంగుతోంది, లంక గ్రామాలను ముంచెత్తుతోంది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మామిడివరం నియోజకవర్గంలోని పలు లంక గ్రామాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కృష్ణమ్మ కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.






## మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసు..
# నిర్దోషిగా బ్రిజ్‌భూషణ్..!!

**బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట..!!**

- మరో నిందితుడైన డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది
- సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కోర్టు ఈ కేసును కొట్టేసింది

మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట దక్కింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి అశ్విని పన్వార్ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడైన డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టేసింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ఆధారంగా





బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం 2023 జూన్ 15న మహిళల గౌరవానికి భంగం కలిగించడం, లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడినట్లు పలు సెక్షన్ల కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 మే 10న ట్రయల్ కోర్టు ఐదుగురు మహిళా రెజ్లర్లకు సంబంధించిన ఆరోపణలపై బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు నమోదు చేసింది. ఇద్దరు రెజ్లర్లను బెదిరించిన ఆరోపణలపైనా విచారణ కొనసాగింది. అలాగే ఒక మైనర్ రెజ్లర్ కూడా ఆరోపణలు చేసినప్పటికీ, అనంతరం ఆమె ఫిర్యాదును ఉపసంహరించుకోవడంతో పోక్సో చట్టం కింద నమోదైన కేసును పోలీసులు రద్దు చేశారు. తాజా తీర్పుతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, వినోద్ తోమర్ ఇద్దరూ ఈ కేసులో నిర్దోషులుగా విడుదలయ్యారు.



## కామన్వెల్త్ గేమ్స్ అద్భుతంగా
# ముగిశాయి..!!

- ఇది మన క్రీడాకారుల అచంచలమైన పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించే ఒక విశేషమైన విజయం
- భారత్‌కు గౌరవప్రదంగా ప్రాతినిధ్యం వహించాలనే కలపై ఉన్న అచంచలమైన నమ్మకానికి నిదర్శనం
- ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**కామన్వెల్త్ గేమ్స్ 2026, భారత 39 పతకాలతో అద్భుతంగా ముగిశాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఇది మన క్రీడాకారుల అచంచలమైన సంకల్పం, క్రమశిక్షణ, పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించే ఒక విశేషమైన విజయమని పేర్కొన్నారు.**

**అమరావతి :** కామన్వెల్త్ గేమ్స్ 2026, భారత 39 పతకాలతో అద్భుతంగా ముగిశాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఇది మన క్రీడాకారుల అచంచలమైన సంకల్పం, క్రమశిక్షణ, పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించే ఒక విశేషమైన విజయమని పేర్కొన్నారు. క్రీడాకారులు సాధించిన ప్రతి పతకం, సంవత్సరాల తరబడి చేసిన త్యాగం, అవిశ్రాంత శిక్షణతో భారత్‌కు గౌరవప్రదంగా ప్రాతినిధ్యం వహించాలనే కలపై ఉన్న అచంచలమైన నమ్మకానికి నిదర్శనమని వెల్లడించారు.



## ప్రధానిని దూషించిన బాలికపై కేసు..
# కొనసాగించబోం

**: ఢిల్లీ పోలీసులు**

- నోయిడా పోలీసులు ఇటీవల "జీరో ఎఫ్ఐఆర్" నమోదు చేసి ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ
- 18 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను నిషేధించాలి
- చిన్నారులకు తెలియక సులభంగా ఇతరుల ప్రభావానికి లోనయ్యే ప్రమాదం ఉంది
- వారి దృష్టి చదువులపైనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

నీట్ పేపర్ లీక్ ఆందోళనల్లో భాగంగా ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మైనర్ బాలికపై కేసును కొనసాగించబోమని ఢిల్లీ పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి. ఈ ఘటనకు సంబంధించి నోయిడా పోలీసులు ఇటీవల "జీరో ఎఫ్ఐఆర్" నమోదు చేసి ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆమె వ్యాఖ్యలు ప్రధాని పదవిని అగౌరవపర్చేలా, శాంతియుత పరిస్థితులకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. అయితే, ప్రస్తుతం ఆ కేసును బాలికపై కొనసాగించడం లేదని పోలీసులు వెల్లడించారు. తన కుమార్తెపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు వయసు 25 ఏళ్లుగా నమోదు చేశారని.. కానీ, ఆమె వయసు 15 ఏళ్లే అని తన తల్లి చెప్పిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ క్రమంలోనే బాలిక తల్లి తప్పు తెలుసుకుని ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. తన కుమార్తెను క్షమించి గొప్ప మనసు చాటుకున్నారని ఆమె ప్రధానిని

..2వ పేజీలో

# సంపాదకీయం

## ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో..

# మరో ట్విస్ట్..

### భర్తకు దూరంగా ఉంటున్న మరో మహిళతో రిలేషన్..

**ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదుతో అరెస్టైన ఉదయ్‌కు మరో మహిళతో సన్నిహిత సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్టు సమాచారం. అశోక్‌నగర్‌లోని ఆయన నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు ప్రేమలేఖలు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, కత్తిని స్వాధీనం చేసుకుని పలు కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. మరో మహిళ ఇచ్చిన వివరాలు, సేకరించిన ఆధారాల ఆధారంగా కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.**

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి.. సస్పెండ్, అరెస్ట్‌తో హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ పేరు.. ఆల్ ఆఫ్ సడెన్‌గా తెలుగు




రాష్ట్రాల్లో సంచలనంగా మారిన విషయం తెలిసిందే.. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై.. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి సంచలన ఆరోపణలు చేశారు. లైంగిక దాడి, బెదిరింపులు, వేధింపులకి గురిచేశాడని ఆమె ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఈ కేసులో ఉదయ్ అరెస్ట్‌తో పాటు రిమాండ్ కూడా జరిగిపోయింది. అయితే.. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో ట్విస్ట్‌ల మీద ట్విస్టులు వెలుగు చూస్తున్నాయి.. ఉదయ్ కృష్ణారెడ్డికి మరో మహిళతోనూ సన్నిహిత సంబంధాలున్నాయని పోలీసులు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం.. తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ట్రైనీ మహిళా ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే.. ఉదయ్ ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ ఈ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. అయితే.. ఉదయ్ కృష్ణారెడ్డి మరో మహిళతోనూ రిలేషన్‌షిప్ లో ట్రైనీ మహిళా ఐపీఎస్ ఫిర్యాదు చేయగా.. ఆ దిశగా దర్యాప్తు చేసిన అధికారులు కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం..

**రెండు ప్రేమ లేఖలు స్వాధీనం..** కేసు దర్యాప్తులో భాగంగా.. పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఉదయ్ కృష్ణారెడ్డి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ అలాగే.. ఇద్దరు వ్యక్తుల చేతిరాతతో ఉన్న రెండు ప్రేమ లేఖలు, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే.. ప్రేమలేఖలపై రాసిన పేర్ల ఆధారంగా ఆరా తీసిన పోలీసులకు మరో కొత్త ఆధారం దొరికింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ మహిళతో సన్నిహిత సంబంధం ఉన్నట్లు పేర్కొంటున్నారు. సదరు మహిళకు 2014లోనే వివాహం కాగా.. ఆమె 2023 నుంచి భర్తకు దూరంగా కుమారుడితో కలిసి ఉంటోంది.. ఈ సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డితో ఆమెకు స్నేహం కుదిరింది. హైదరాబాద్ వచ్చిన ఆమె కొంతకాలం ప్రైవేటు సంస్థలో పనిచేసి.. ఈ ఏడాది జనవరిలో ఉదయ్ కృష్ణారెడ్డి సూచనల మేరకు ఆ ఉద్యోగానికి రాజీనామా చేసింది. అనంతరం అశోక్‌నగర్‌లోని ఓ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తోంది. అయితే.. లివ్ ఇన్ రిలేషన్‌లో ఉందామని ఉదయ్ కృష్ణారెడ్డి కోరినా.. చట్టప్రకారం విడాకులు రాకపోవటంతో ఆమె తిరస్కరించినట్టు తెలుస్తోంది.

**ఎలా బయటకు వచ్చిందంటే..** అశోక్‌నగర్‌లో ఉంటున్న ఆ మహిళను మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిబ్రవరిలో కలవగా.. ఈ విషయం బయటకు వచ్చింది. తాను కూడా ఉదయ్ తో సన్నిహితంగా ఉన్నానని, ఆయన తనపై దాడి చేస్తున్నాడని.. ఇబ్బంది పెడుతున్నాడంటూ మహిళా ట్రైనీ ఐపీఎస్ బాధను పంచుకున్నట్లు సమాచారం.. దీంతో సదరు మహిళ నిందితుడికి దూరంగా ఉంటున్నట్టు గుర్తించారు. అయితే.. ఈ కేసులో పలు కోణాల్లో విచారణ జరుపుతున్న పోలీసులు పలువురి నుంచి వాంగ్మూలాలు సేకరించినట్లు తెలుస్తోంది.

## నేషనల్ హైవేపై ఎలుగుబంటి...

# హాల్‌చల్.. ..!!

**బండి హారన్లు కొట్టడంతో ఏం చేసిందో వీడియోలో చూడండి..**

**నంద్యాల జిల్లాలో ఎలుగుబంటి కలకలం రేపింది. ఎర్రగూడూరు గ్రామ శివారులోని అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన ఎలుగుబంటి రహదారి దాటేందుకు యత్నించగా, వాహనదారులు సమయస్ఫూర్తితో హారన్లు మోగిస్తూ కేకలు వేయడంతో అది తిరిగి అడవిలోకి పరుగులు తీసింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.**



నంద్యాల జిల్లా పాములపాడు మండలం ఎర్రగూడూరు ప్రాంతంలో ఎలుగుబంటి సంచారం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తుంది. ఎర్రగూడూరు గ్రామ శివారులోని అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన ఒక ఎలుగుబంటి, సమీపంలో ఉన్న నేషనల్ హైవేని దాటేందుకు యత్నించింది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ఎలుగుబంటిని చూసి ఒక్కసారిగా హారన్లు మోగిస్తూ బిగ్గరగా కేకలు వేశారు. దాంతో భయపడిన ఆ మృగం వెంటనే తిరిగి అడవిలోకి పరుగులు తీసింది. వాహనదారులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటనతో ఎర్రగూడూరుతో పాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న పొలాల్లోకి వెళ్లాలంటేనే రైతులు, వ్యవసాయ కూలీలు వణికిపోతున్నారు.

**గతంలో దాడులు..** ఈ ప్రాంతంలో ఎలుగుబంట్ల భయం కొత్తేమీ కాదని స్థానికులు చెబుతున్నారు. గతంలోనూ ఇదే ప్రాంతానికి చెందిన జనకుడు అనే గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో పనిచేసుకుంటుండగా, అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఆ పాత ఘటనను గుర్తుచేసుకుంటూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో మాత్రమే కాదు, పగటిపూట కూడా బయటకు రావడానికి భయపడుతున్నారు.

**అటవీ శాఖ హెచ్చరికలు – గ్రామస్తుల డిమాండ్..** ఎలుగుబంటి సంచారం నేపథ్యంలో పరిసర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. అయితే కేవలం హెచ్చరికలతో సరిపెట్టకుండా ఈ ప్రాంతంలో ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా ఉన్నందున వాటిని తక్షణమే బోనులో బంధించి, సుదూర అటవీ ప్రాంతంలో వదలిపెట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## ఉక్రెయిన్ యుద్ధం తర్వాత.. రికార్డు స్థాయిలో

# రష్యా చమురు దిగుమతులు..!!

**(మొదటిపేజీ తరువాయి)**

ముడి చమురును దిగుమతి చేసుకుంది. జూన్‌కంటే ఇది స్వల్పంగా అధికం. రష్యా నుంచి చమురు సరఫరా జూన్‌లో 2.7 మిలియన్ బ్యారెళ్లు ఉండగా.. జులై నాటికి 2.8మిలియన్ బ్యారెళ్లకు పెరిగింది. దీంతో దేశ ముడి చమురు దిగుమతులలో రష్యా వాటా 55.5 శాతానికి చేరింది. దిగుమతులు పెరగడానికి రష్యా చమురు నిరంతరం అందుబాటులో ఉండడమే ప్రధాన కారణమని కెప్లర్ ప్రధాన విశ్లేషకుడు నిఖిల్ దుబే పేర్కొన్నారు. అయితే ఎల్‌పీజీ దిగుమతులకు మాత్రం భారత్.. అమెరికా (USA) వైపే మొగ్గు చూపింది. జులైలో దిగుమతి చేసుకున్న మొత్తం 1.2 మిలియన్ టన్నులకు పైగా ఎల్‌పీజీలో సుమారు 73శాతం అగ్రరాజ్యం నుంచే కొనుగోలు చేసింది.

**పశ్చిమాసియా నుంచి పెరుగుతున్న దిగుమతులు..** జులై నుంచి భారతీయ రిఫైనరీలు పశ్చిమాసియా సరఫరాదారుల (ఔవర్-ౕాంఋఅ ఒబజాజూశ్రీఅవతీం) నుంచి కొనుగోళ్లను పెంచినట్లు కెప్లర్ వెల్లడించింది. వీటిలో ప్రధాన సరఫరాదారుగా సౌదీఅరేబియా నిలిచింది. ఆ దేశం నుంచి జూన్‌లో రోజుకు 2.9 లక్షల బ్యారెళ్ల (ఎం) చమురు దిగుమతి చేసుకోగా.. జులైలో అవి 4.2 లక్షల బ్యారెళ్లకు పెరిగాయి. ఇరాక్, కువైట్‌ల నుంచి కూడా చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. మరోవైపు యూఏఈ నుంచి దిగుమతులు జూన్‌లో 5.1 లక్షల బ్యారెల్స్ ఉండగా.. జులైలో 4.6 లక్షల బ్యారెల్స్‌కు తగ్గాయి. అయినప్పటికీ అది భారత్‌కు రెండో అతిపెద్ద అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా నిలిచింది.

## ప్రధానిని దూషించిన బాలికపై కేసు..

# కొనసాగించబోం : ఢిల్లీ పోలీసులు

**(మొదటిపేజీ తరువాయి)** కొనియాడారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను నిషేధించాలని ఆమె సూచించారు. చిన్నారులకు తెలియక సులభంగా ఇతరుల ప్రభావానికి లోనయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వారి దృష్టి చదువులపైనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఉప్పొంగుతున్న గోదారి..!!

**లంక గ్రామాల పరిస్థితి ఇదే..**

**తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో గోదావరి ఉప్పొంగుతోంది**

**లంక గ్రామాలను ముంచెత్తుతోంది..ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు**

**కృష్ణమ్మ కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో గోదావరి ఉప్పొంగుతోంది, లంక గ్రామాలను ముంచెత్తుతోంది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మామ్మిడివరం నియోజకవర్గంలోని పలు లంక గ్రామాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కృష్ణమ్మ కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.**



తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఏపీలో వానలు దంచికొడుతున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగులు వంకలు పొంగి పొర్లుతూ అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాగా, ఇప్పుడు మనం దంచికొట్టే వానల్లో లంక గ్రామాల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుందాం. వర్షాలు విస్తారంగా పడుతుండడంతో గోదావరి పరుగులు పెడుతుంది. క్రమ క్రమంగా ఉధృతి పెరుగుతుంది. దీంతో లంక గ్రామాల్లోకి వదర నీరు చేరడంతో ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలోకి నీరు చేరి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మామ్మిడివరం నియోజక వర్గంలోని శేరిలంక, కమిని, పశువులలంక, గురజాపులంక, కూనలంక, తానేలంక, పొట్టిలంక వీటిల్లోకి వరద నీరు ఎక్కువ మొత్తంలో చేరింది. ఇళ్లలోకి నీరు చేరడంతో అధికారులు వెంటనే అప్రమత్తం అయ్యారు. అక్కడి లోని చాలా ఇళ్లను ఖాళీ చేయించారు. అంతేకాకుండా పలు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, సహాయ చర్యలు చేపట్టారు. ఎవరికీ ఎలాంటి హాని లేకుండా ఉండేలా చూసుకునేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. లంక గ్రామాల్లోని చాలా మంది ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేశారు. గోదావరి నది మాత్రమే కాకుండా మరో వైపు కృష్ణానది వరద ప్రవాహం కూడా విపరీతంగా పెరుగుతుందని చెబుతున్నారు అధికారులు. భారీ వర్షాల నేపథ్యంలో వరద ఉధృతి కూడా పెరుగుతుండటంతో ప్రజలు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు జారీ చేయడం జరిగింది.

# కామన్వెల్త్ గేమ్స్: ఏకంగా 8 స్వర్ణాలు..

**(మొదటిపేజీ తరువాయి)** కుటుంబం నుంచి వచ్చి బాక్సింగ్‌లో రాణించింది. హర్జిందర్ కౌర్ పాఠశాలకు సైకిల్‌పై వెళ్లి, సాయంత్రం పొలంలో తండ్రికి సాయం చేస్తూనే అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. షర్మిలా దన్‌ఖడ్.. వైకల్యాన్ని, గృహహింసను అధిగమించి 40 ఏళ్ల వయసులో పసిడి నెగ్గింది. సీమా కళిరామన్ బిడ్డకు జన్మనిచ్చిన 11 నెలలకే ప్రాక్టీస్‌కు దిగింది. భర్త అండతో కాంస్య పతకం సాధించింది. జ్ఞానేశ్వరి యాదవ్.. పీరియడ్స్ తొలిరోజే నొప్పిని బరిస్తూ 199 కిలోల బరువు ఎత్తి రజతం సాధించింది. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. కష్టాల సాగరాన్ని దాటి కలల ప్రపంచాన్ని కళ్ల ముందుకు రప్పించుకున్న మహిళల విజయగాథ! ఈ అథ్లెట్ల ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తి.

**భారత క్రీడలకు కొత్త ముఖచిత్రం...** ఒకప్పుడు అంతర్జాతీయ వేదికపై ఒక మహిళ స్వర్ణం గెలవడం అంటే చాలా అరుదైన విషయం. కానీ ఇప్పుడు రోజులు మారాయి. అన్ని విభాగాల్లో తామేమీ తక్కువ కాదని నిరూపిస్తోన్న మహిళలు.. క్రీడా రంగంలోనూ రాణిస్తున్నారు. అంతర్జాతీయ వేదికపై పతకాల పంట పండిస్తున్నారు. కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ 13 పసిడి పతకాలు గెలిస్తే.. అందులో 8 స్వర్ణాలు మహిళలే సాధించడం విశేషం. గ్లాస్గోలో సాధించిన ఈ విజయాలు కేవలం పతకాల లెక్క మాత్రమే కాదు.. భారత మహిళా క్రీడల ఎదుగుదలకు, వారి పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచాయి.

**కామన్వెల్త్ క్రీడల్లో భారత మహిళల పతకాలు..** స్వర్ణం(8): మీరాబాయి చాను (వెయిట్ లిఫ్టింగ్), షర్మిలా దన్‌ఖడ్(పారా అథ్లెటిక్స్), అస్మితా దే(జుడో), ప్రీతి పవార్, జైస్మిన్ లాంబోరియా, సాక్షి చౌదరి, ప్రియా ఘంఘాస్, అరుంధతి చౌదరి (బాక్సింగ్) రజతం (5): హర్జిందర్ కౌర్ (వెయిట్ లిఫ్టింగ్), లవ్లీనా (బాక్సింగ్), రూపాల్ (400 మీటర్లు), నికితా ధ్యాని (5,000 మీటర్లు), జ్ఞానేశ్వరి యాదవ్(వెయిట్ లిఫ్టింగ్) కాంస్యం (4): సీమ కళిరామన్ (డిస్కస్ త్రో), నికితా (1,500 మీటర్లు), సోనియా బైష్యా (వెయిట్ లిఫ్టింగ్), లిషా దాస్ (పారా ట్రాక్ సైక్లింగ్)

## ఇకపై జంతర్ మంతర్ వద్ద...

# ఆందోళనలు, నిరసనలు బంద్..!!

**సుప్రీంకోర్టులో జరిగిన కీలక విచారణ**

**నిరసనల కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి**

**నిత్యావసర వస్తువుల సరఫరాకు, వైద్య సేవలకు ఆటంకం కలుగుతోంది**

**ధర్నాలు, ఆందోళనలు నిర్వహించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి**

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనల నిర్వహణపై సోమవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. నిరసనల నిర్వహణకు జంతర్ మంతర్ సరైన




ప్రదేశం కాదంటూ సతీష్ చంద్ కౌశిక్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. నిత్యావసర వస్తువుల సరఫరాకు, వైద్య సేవలకు ఆటంకం కలుగుతోందని సతీష్ చంద్ కౌశిక్ కోర్టుకు వివరించారు. ధర్నాలు, ఆందోళనలు నిర్వహించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. పిటిషనర్ వాదనలు విన్న కోర్టు నిరసనలకు ప్రత్యామ్నాయ వేదిక కేటాయింపుపై కేంద్రాన్ని సంప్రదించాలని సొలిసిటర్ జనరల్‌కు సూచించింది.

## భారత్‌లో బంగారం ధర రూ.37,000 మేర తగ్గినా,

# ప్రజలు ఎందుకు కొనడం లేదు..!!

**భారతదేశంలోప్రస్తుతం బంగారం డిమాండ్ తగ్గింది. బంగారంపై 37 వేల రూపాయలు తగ్గినా కూడా వినియోగ దారులు కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే దేశంలో బంగారం డిమాండ్ తగ్గడానికి అసలు కారణాలు ఏవో మీకు తెలుసా..?**



ప్రజలకు బంగారంపై విరక్తి కలిగిందా? లేక ఏడాది పాటు బంగారం కొనుగోలుకు దూరంగా ఉండాలన్న ప్రధాని మోదీ విజ్ఞప్తిని మరీ సీరియస్‌గా తీసుకున్నారా? గణాంకాలు కూడా దాదాపు ఇలాంటి విషయాన్నే సూచిస్తున్నాయి. బంగారం చౌకగా లభిస్తున్నప్పటికీ, ప్రజలు దానికి దూరంగా ఉంటున్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వారి 2026 రెండవ త్రైమాసిక నివేదిక ప్రకారం, బంగారం డిమాండ్ 6 శాతం మేర పడిపోయింది. ప్రజలు బంగారం కొనడానికి వెనుకాడుతున్నారు.

**భారతీయులు బంగారం పట్ల ఎందుకు నిరాశ చెందారు?..** డబ్ల్యూజీసీ నివేదిక ప్రకారం, ఏప్రిల్-జూన్ 2026 త్రైమాసికంలో భారతదేశంలో బంగారం డిమాండ్ గతేడాదితో పోలిస్తే 6% తగ్గి 131.4 టన్నులకు పడిపోయింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో బంగారం డిమాండ్ 139.7 టన్నులకు చేరుకుంది. బంగారం ధరల విషయానికొస్తే, జనవరి నుంచి ధర రూ.37,000 మేర తగ్గింది. బంగారం ధరలు పడిపోయినప్పటికీ, డిమాండ్‌లో ఎలాంటి మార్పు లేదు. ఆభరణాల డిమాండ్ 15% కంటే ఎక్కువగా తగ్గి, 88.8 టన్నుల నుంచి 75.1 టన్నులకు పడిపోయింది.

**బంగారం ఎంత చౌకగా మారింది?...** ఇరాన్ యుద్ధం, పెరుగుతున్న ముడి చమురు ధరలు బంగారం ధరలపై గణనీయమైన ఒత్తిడిని తెచ్చిపెట్టాయి. ముడి చమురు ధరలు వేగంగా పడిపోతున్నాయి. జనవరి 29న, 10 గ్రాముల బంగారం ధర రూ.1.79 లక్షలకు చేరి గరిష్ట స్థాయికి చేరుకుంది. కానీ అప్పటి నుండి బంగారం ధర క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర రూ.1.42 లక్షలకు చేరింది. అంటే, యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి 10 గ్రాముల బంగారం ధర సుమారుగా రూ.37,000 మేర తగ్గిపోయింది. సాధారణంగా ధరలు తగ్గిన తర్వాత కొనుగోళ్లు పెరుగుతాయి. కానీ భారతదేశంలో బంగారం డిమాండ్ గణనీయంగా పడిపోయింది.

**భారతదేశంలో బంగారం డిమాండ్ తగ్గడానికి కారణం ఏమిటి?...** బంగారం దిగుమతులపై పెరిగిన పన్ను: గల్ఫ్ యుద్ధ సమయంలో ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకాన్ని 6% నుండి 15%కి పెంచింది. దీనివల్ల బంగారం దిగుమతుల వ్యయం పెరిగి, కొనుగోళ్లు మందగించాయి. ఏప్రిల్-జూన్ 2026 త్రైమాసికంలో బంగారం దిగుమతులు గతేడాదితో పోలిస్తే 23% తగ్గి 98.1 టన్నులకు పడిపోయాయి. ప్రధాని మోదీ విజ్ఞప్తి ప్రభావం చూపింది: ఏడాది పాటు బంగారం కొనుగోలుకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బంగారం దిగుమతులపై వెచ్చించే విదేశీ మారక నిల్వల భారాన్ని తగ్గించేందుకు ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. ప్రధాని విజ్ఞప్తి ఫలించింది. బంగారం దిగుమతులలో స్పష్టమైన తగ్గుదల కనిపిస్తోంది. బంగారం రాబడిని ఇవ్వడం లేదు: బంగారం రెండు సంవత్సరాలుగా పెట్టుబడిదారులకు గణనీయమైన రాబడిని అందించింది. కానీ ఇప్పుడు అది చెప్పుకోదగ్గ రాబడిని ఇవ్వడం లేదు. బంగారం ధరలు గణనీయంగా హెచ్చుతగ్గులకు లోనవడంతో పెట్టుబడిదారులు బంగారం వైపు వెనకడుగు వేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే నేటి బంగారం ధరలు సుమారు 60% ఎక్కువగా ఉన్నాయి. ఇది ప్రజలను తేలికైన, తక్కువ క్యారెట్ల ఆభరణాల వైపు మళ్లించింది. ఏప్రిల్ -- జూన్ మధ్య వివాహాల సీజన్ లేకపోవడం కూడా డిమాండ్‌ను తగ్గించింది.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు...

# బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్







**పుట్టపర్తి** : ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 317 అర్జీలు అందగా, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్ఓ కొండయ్య, ఎస్‌డీసీ విజయకుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో

# ఘనంగా నిర్వహించాలి

**: కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్**

**పుట్టపర్తి** ఈ నెల 15న నిర్వహించనున్న 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, పరేడ్ మైదానంలో చేపట్టాల్సిన సన్నాహకాలపై సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్‌తో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ, వేదిక ఏర్పాటు, అలంకరణ పనులను సుందరంగా చేపట్టాలని సూచించారు. పరేడ్ మైదానంలో బారికేడింగ్, వైట్‌వాష్ తదితర పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రత్యేక అతిథులను గౌరవప్రదంగా ఆహ్వానించాలని, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో జిల్లా సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా ఆకట్టుకునే అభివృద్ధి శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ, డ్వామా, వ్యవసాయ అనుబంధ శాఖలు, ఏపీఎంఐపీ, జల వనరుల శాఖల అధికారులను ఆదేశించారు. దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వేడుకల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల్లో విశిష్ట సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు ప్రతిపాదిత జాబితాలను గడువులోగా సమర్పించాలని తెలిపారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీసుల మార్చ్‌పాస్ట్‌లో ఎన్సీసీ కేడెట్లను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పోలీసు శాఖ తరఫున చేపట్టాల్సిన భద్రతా, పరేడ్ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, అదనపు ఎస్పీ అంకిత సురానా, జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య, ఆర్డీవో సువర్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.






## పీజీఆర్ఎస్ అర్జీలను పెండింగ్ లేకుండా

# సత్వరమే పరిష్కరించాలి

**: జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**అనంతపురం** : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలో అధికంగా వస్తున్న భూ సంబంధిత సమస్యలు, రీఓపెన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో పీజీఆర్ఎస్ అర్జీలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీల్లో దాదాపు 80 శాతం భూ సమస్యలేనని, వాటి పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సర్వేకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే ఏడి సర్వేయర్ స్పందించి మండల సర్వేయర్లతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జూన్ 20న సర్వే కోసం చలానా చెల్లించి దరఖాస్తు చేసినా ఇప్పటికీ స్పందించని ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆర్డీవోలు మండల కార్యాలయాలను సందర్శించి పెండింగ్ అర్జీలను సమీక్షించి, సంబంధిత తహసీల్దార్లతో మాట్లాడి త్వరితగతిన క్లియర్ చేయించాలని చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు రీఓపెన్ చేసిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పకుండా ప్రతి అర్జీని పూర్తిగా పరిశీలించి, పరిష్కరించే అవకాశం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని, సాధ్యం కాకపోతే కారణాలను స్పష్టంగా పేర్కొంటూ అర్జీదారునికి అర్థమయ్యేలా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. 'వన్ మంత్--ఫోర్ విజిట్' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా తహసీల్దార్లు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సమావేశంలో ఆర్డీవోలు, ల్యాండ్ అండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్, తహసీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.



### రేపు అనంతపురం జిల్లాలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పర్యటన

**అనంతపురం** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈనెల 4వ తేదీ మంగళవారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. సాజిదా బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగ సమావేశ మందిరంలో స్టాకింగ్, సైబర్ స్టాకింగ్ నివారణ, డిజిటల్ భద్రత, మహిళలు, బాలికల రక్షణ, సైబర్ నేరాల నివారణ, చట్టపరమైన హక్కులపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. సాజిదా బేగం కోరారు.



## ధర్మవరంలో ఆగస్టు 28న

# మెగా జాబ్ మేళా..

**నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్**

**రాష్ట్ర సచివాలయం** : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 28న ధర్మవరంలోని సీఎన్‌బీ కళ్యాణ మండపంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం విజయవాడ సచివాలయంలో జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన, ఉద్యోగాల కోసం యువత నగరాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రముఖ జాతీయ, బహుళజాతి సంస్థలను నేరుగా ధర్మవరానికి తీసుకొస్తున్నామని చెప్పారు. ఈ మెగా జాబ్ మేళాలో 90కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని, అభ్యర్థులకు అక్కడికక్కడే ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి అర్హతలను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం లభించే అవకాశం ఉందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు అర్హులని మంత్రి వివరించారు. అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన రిజిస్ట్రేషన్ లింక్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా ముందుగానే నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 8688466361, 9390176421, 9966682246 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్, దినకర్ రెడ్డి, ఇమ్రాన్ సమాన కాలేజ్ డిజైన్ స్టడీస్ డైరెక్టర్, సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




## తల్లిపాల వారోత్సవాలను జిల్లావ్యాప్తంగా

# సమర్థంగా నిర్వహించాలి

**: డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఫిరోజ్ బేగం**

**పుట్టపర్తి** : : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లావ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించి, తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాలని శ్రీ సత్యసాయి జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఫిరోజ్ బేగం అధికారులను ఆదేశించారు. జిల్లా కార్యాలయంలో జిల్లా అధికారులు, వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రులు, మహిళా--శిశు ఆసుపత్రుల్లో తల్లిపాల వారోత్సవాల ప్రారంభ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రసవం జరిగిన గంటలోపు శిశువుకు తల్లిపాలు పట్టించడం, ముర్రుపాల ప్రాముఖ్యత, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాల్సిన అవసరంపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించాలని తెలిపారు తక్కువ బరువుతో పుట్టిన శిశువులు, అకాల శిశువుల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని, అవసరమైన చోట తల్లిపాలు అందించేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్రెస్ట్ మిల్క్ ప్రత్యామ్నాయ ఉత్పత్తుల ప్రచారాన్ని నిరోధించేందుకు ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించాలని చెప్పారు. వైద్య, నర్సింగ్ కళాశాలల్లో క్విజ్‌లు, వ్యాసరచన, చిత్రలేఖనం, పాత్రధారణ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, హెచ్‌వీఎన్‌లు, ఏఎన్ఎంలు, గర్భిణీ--బాలింతల సందర్శనల ద్వారా తల్లిపాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. 9 నుంచి 59 నెలల పిల్లలకు విటమిన్--ఏ ప్రాముఖ్యతపై కౌన్సెలింగ్ నిర్వహించి, టీకా కార్యక్రమాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. తల్లిపాల ప్రోత్సాహంలో విశిష్ట సేవలందించిన అధికారులు, నర్సులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను సత్కరించాలని, ప్రతిరోజు కార్యక్రమాల వివరాలను జిల్లా కేంద్రానికి పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు డాక్టర్ చెన్నారెడ్డి, డీపీఎన్‌వో వీరమ్మ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓలు సుబ్రహ్మణ్యం, గఫూర్, వెంగళమ్మ చెరువు, పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పాల్గొన్నారు.



## ప్రత్యేక విక్రయ కేంద్రాల్లో తక్కువ ధరకే నాణ్యమైన

# బియ్యం విక్రయాలు ప్రారంభం

**అనంతపురం(** బియ్యం ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం విక్రయాలను ప్రారంభించింది. అనంతపురం అర్బన్ రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్. ప్రేమంత్ కుమార్ సోమవారం ప్రారంభించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ కింద ఎంపిక చేసిన కౌంటర్ల ద్వారా స్టీమ్ బియ్యాన్ని కిలో రూ.52కు, ముడి బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయిస్తున్నారు. ప్రతి రేషన్ కార్డుదారుకు 10 కిలోల చొప్పున బియ్యం అందజేస్తున్నారు. ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి టి.ఎస్. శోభారాణి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జి. రమేష్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో మరో రెండు ప్రత్యేక విక్రయ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. బియ్యం కొనుగోలు చేసేందుకు వచ్చే రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## విద్యా ప్రగతి సూచీల అమలుతో జిల్లాను...

# అగ్రస్థానంలో నిలబెట్టాలి: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్










**పుట్టపర్తి** :

పాఠశాల విద్యలో నిర్దేశించిన విద్యా ప్రగతి సూచీల (కేపీఐలు)ను సమర్థవంతంగా అమలు చేసి శ్రీ సత్యసాయి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పుట్టపర్తిలోని మంగళకర జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో మండల విద్యాశాఖాధికారులు (ఎంఈఓలు), క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన కేపీఐల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు పాఠశాల విద్యే పునాది అని పేర్కొన్న కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును 10 శాతం పెంచడంతో పాటు 'జీరో డ్రాపౌట్' లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు 95 శాతానికి పైగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక స్థాయిలోనే పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) లక్ష్యాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. 9వ తరగతిలో సి, డి గ్రేడ్లు సాధించే విద్యార్థుల సంఖ్యను 25 శాతం లోపు తగ్గించాలని, 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణతతో పాటు సగటు మార్కులు పెరిగేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. తక్కువ స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని, ఎస్ఆర్‌కేవీఎం కిట్ల పంపిణీని వంద శాతం పూర్తి చేయడంతో పాటు మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. కేపీఐలు కేవలం డాష్‌బోర్డ్‌లో కనిపించే సంఖ్యలు మాత్రమే కాకుండా జిల్లా విద్యార్థుల భవిష్యత్తుకు సూచికలని పేర్కొన్న కలెక్టర్, ఎంఈఓలు, క్లస్టర్ హెచ్‌ఎంలు సమర్థవంతమైన నాయకత్వంతో పనిచేసి జిల్లాను విద్యారంగంలో ఆదర్శంగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి క్రిస్టప్ప, సమగ్ర శిక్ష అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లె సాక్షి
మంగళవారం 04 ఆగస్టు, 2026

## చట్టబద్ధంగా ప్రతి ఫిర్యాదును పరిశీలించి
# బాధితులకు న్యాయం

**: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్**

**పుట్టపర్తి :** ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును చట్ట పరిధిలో నిష్పాక్షికంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి మొత్తం 85 వినతిపత్రాలను ఎస్పీ స్వీకరించారు. అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి అంశాన్ని నిష్పాక్షికంగా విచారించి చట్టబద్ధంగా పరిష్కరించేలా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన వికలాంగుల వద్దకు స్వయంగా వెళ్లిన ఎస్పీ వారి సమస్యలను ఓపికగా విని, అవసరమైన సహాయం అందించే దిశగా వెంటనే చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావచ్చని, అందిన ప్రతి వినతిపై న్యాయపరంగా స్పందిస్తూ బాధితులకు అండగా నిలుస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కుటుంబ వివాదాలు, భూ తగాదాలు, సైబర్ మోసాలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 85 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, ఐపీఎస్, సీఐలు బొజ్జప్ప, లక్ష్మీకాంత్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తప్పవు..
# లైసెన్స్ రద్దుకూ సిఫార్సు చేస్తాం

**: పుట్టపర్తి అర్బన్ సీఐ యువరాజు**

**పుట్టపర్తి** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు కూడా సంబంధిత అధికారులకు సిఫార్సు చేస్తామని పుట్టపర్తి అర్బన్ సీఐ యువరాజు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున కర్ణాటక--నాగేపల్లి సమీపంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను బ్రెత్ అనలైజర్‌తో పరీక్షించగా అధిక మోతాదులో మద్యం సేవించినట్లు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి పుట్టపర్తి గౌరవ న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా కోర్టు రూ.10 వేల జరిమానా విధించినట్లు సీఐ వెల్లడించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని పేర్కొన్న సీఐ యువరాజు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులతో పాటు అవసరమైన సందర్భాల్లో లైసెన్స్ రద్దుకు కూడా సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్ణాటక--నాగేపల్లి వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించకుండా బైపాస్ మార్గాన్ని వినియోగించాలని, ప్రశాంత్ పెట్రోల్ బంక్ వద్ద నుంచి కూడా భారీ వాహనాలు బైపాస్ ద్వారానే వెళ్లాలని సూచించారు. ఎయిర్‌పోర్టు రహదారిపై ద్విచక్ర వాహనాలు, ఇతర తేలికపాటి వాహనాలు మాత్రమే ప్రయాణించాలని తెలిపారు. ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ మద్యం సేవించిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని పుట్టపర్తి అర్బన్ సీఐ యువరాజు విజ్ఞప్తి చేశారు.






## కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి
# రైతులను ఆదుకోవాలి

**: చింతా శరత్ కుమార్ రెడ్డి**

**అమడగూరు :** అమ్మడుగూరు మండలం జోకుల గ్రామంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చింతా శరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలోని బృందం వేరుశనగ పంటలను సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ప్రధాన పంటైన వేరుశనగను రైతులు అప్పులు చేసి సాగు చేసినప్పటికీ, ప్రారంభంలో స్వల్ప వర్షాలు కురిసిన తర్వాత వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని, జిల్లాలో అధిక శాతం రైతులు తీవ్ర పంట నష్టాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపడుతున్నట్లే, రాయలసీమలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితిని కూడా ప్రకృతి వైపరీత్యంగా గుర్తించి అత్యవసర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులకు తక్షణ నష్టపరిహారం అందించడంతో పాటు వాతావరణ ఆధారిత బీమా, పంట బీమాను అర్హులైన రైతులందరికీ 100 శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల సీనియర్ నాయకులు మేకల శ్రీనివాసులు, మండల అధ్యక్షులు రామిశెట్టి వేమ నారాయణ, నాయకులు సురేష్ కుమార్, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజలకు చేరవేస్తూ బియ్యం ధరల నియంత్రణకు
# వినూత్న చర్యలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్

**ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**

**కొత్తచెరువు :** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తూనే, బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం తగ్గించే దిశగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ వినూత్న చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ప్రారంభించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని రాయితీ ధరలకు అందించే కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. కొత్తచెరువు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు. బహిరంగ మార్కెట్‌లో కృత్రిమ కొరత, అధిక ధరలను అరికట్టడంతో పాటు ప్రజలకు నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల ద్వారా సూపర్ ఫైన్ స్టీమ్ రైస్ (బీపీటీ)ను కిలో రూ.52కు, ముడి బీపీటీ బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, మార్కెట్‌లో బియ్యం ధరలు సాధారణ స్థితికి చేరుకునే వరకు ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు సబ్సిడీ ధరలకే బియ్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కేంద్రాల ద్వారా బియ్యం కొనుగోలు చేసి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని రొద్దం, బత్తలపల్లి, సి.కే.పల్లి, గాండ్లపెంట, గోరంట్ల, హిందూపూర్, కదిరి, కొత్తచెరువు, మడకశిర, ముదిగుబ్బ, పెనుగొండ, పుట్టపర్తి, తాడిమర్రి, ధర్మవరం, లేపాక్షి మండలాల్లో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూనే, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా మారనున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.




## ఆరు నెలలు కేవలం...
# తల్లిపాలే బిడ్డకు పట్టాలి

**కొత్తచెరువు :** ప్రతి తల్లి ఆరునెలలు పాటు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని పుట్టపర్తి సీడీపీఓ జయంతి అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ ప్రమీల ఆదేశాల మేరకు కొత్తచెరువు మండల పరిధిలోని బండ్లపల్లి పంచాయతీ పరిధిలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అయ్యగారి రజిత ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భం గా తల్లిపాల ప్రాముఖ్యతపై సోమ వారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీఓ జయంతి హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, మొదటి ఆరు నెలలపాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు పౌష్టికాహారాన్ని ప్రారంభించి, రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలు , గ్రామస్థాయిలో ప్రత్యేక కా ర్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో ఐసీడీఎస్ సూపర్వైజర్ రజితతో పాటు సి హెచ్ ఓ రుక్షాన, ఎ ఎన్ ఎం , అంగన్వాడీ కార్యకర్తలు సుబ్బమ్మ, కృష్ణ కుమారి, స్వర్ణలత,నిర్మల, సుశీల,సాయి లీల,భారతి ఆశ కార్యకర్తలు, కిశోరి బాలికలు గర్భవతులు బాలింతలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# క్రీడా మైదానం ఏర్పాటుకు వినతి

**పుట్టపర్తి :** పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో నివసించే విద్యార్థులు, యువతకు, క్రీడా మైదానాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి క్రీడ మైదానాలు ఏర్పాటు కొరకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ప్రాంతంలో వందలాది మంది యువత , విద్యార్థులు నివసిస్తున్నప్పటికీ, వారికి క్రీడలు ఆడేందుకు సరైన ప్రభుత్వ క్రీడా మైదానం అందుబాటులో లేదనీ. దీనివల్ల యువత తమ క్రీడా ప్రతిభను అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారనీ, ప్రస్తుతం యువతలో ఆరోగ్య సమస్యలు, శారీరక శ్రమ తగ్గడం, మొబైల్ ఫోన్ల వినియోగం పెరగడం ,చెడు అలవాట్ల వైపు ఆకర్షితులయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయనీ. ఇటువంటి పరిస్థితుల్లో ఒక ప్రభుత్వ క్రీడా మైదానం ఏర్పాటు చేయడం వలన యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందనీ, యువతలో శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం క్రమశిక్షణ పెరుగుతాయి. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్బాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో శిక్షణ పొందే అవకాశం ఉంటుందనీ. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీర్చిదిద్దవచ్చు. పాఠశాలలు, కళాశాలల క్రీడా పోటీలు, మండల, జిల్లా స్థాయి టోర్నమెంట్ల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, పుట్టపర్తి టౌన్ ప్రెసిడెంట్ కళ్యాణ్, జిల్లా కార్యదర్శి తలమర్ల హరికృష్ణ, బి ప్రసాద్, ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ లక్ష్మ నాయక్ నాయక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సింధు, తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.



## ఆగస్టు 30న ఉచిత కృత్రిమ చేతుల...
# పంపిణీ కార్యక్రమం: జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

**అనంతపురం :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా శాఖ, రోటరీ క్లబ్ అనంతపురం సం యుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించనున్న "చేయూత" ఉచిత ఫంక్షనల్ ప్రోస్తెటిక్ హ్యాండ్ (కృత్రిమ చేయి) పంపిణీ కార్యక్రమం కరపత్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఓ. ఆనంద్ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ పాల్గొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార (గ్రీవెన్స్) కార్యక్రమం సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోని ఆరు జిల్లాలకు చెందిన మోచేతి కింది భాగంలో చేయి కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులకు రోటరీ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా ఫంక్షనల్ ప్రోస్తెటిక్ హ్యాండ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ముందస్తుగా తమ వివరాలను చేయూత కాల్ సెంటర్-8866306969లో నమోదు చేసుకుని ఆగస్టు 30న జరిగే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించేలా సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలోని కార్యాలయాలు, సంస్థలు, క్షేత్రస్థాయి సిబ్బందికి తక్షణమే సర్క్యులర్లు జారీ చేసి అర్హులైన లబ్ధిదారులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మాలోల, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి అర్చన, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేశవరెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు డా. కె. లక్ష్మీనారాయణ, సుంకర రమేష్, బిసతి భారత్, దాసరి భరత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## వర్షాభావంతో విలవిల్లాడుతున్న రైతులను ఆదుకోవాలంటే
# రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**పుట్టపర్తి :** తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రాయలసీమ జిల్లాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రభుత్వం రైతులను వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణస్వామి రాయల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతులూరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌కు రెవెన్యూ భవనంలో వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు మామిళ్లకుంట క్రాస్ నుంచి రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ శ్రీ సత్యసాయి జిల్లాలో తక్కువ వర్షపాతం కారణంగా వేరుశెనగ, కంది, వరి, ఉలవ తదితర పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని వివరించారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు తక్షణ సాయం అందించాలని కోరారు. వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. గతంలోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అనంతపురం, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నందున ఆయా జిల్లాల రైతులను ఆదుకోవాలని కాపునాడు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు, గ్రేటర్ రాయలసీమ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు పోతులూరయ్య, కృష్ణయ్య, బాలరాజు, నాగరాజు, ఈశ్వరమ్మ, గంగాద్రి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



500 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ శ్రీ శ్రీ ధర్మరాజస్వామి దేవస్థానంలో..

# నూతన రాజగోపుర శిఖర ప్రతిష్ఠ

- కుంభాభిషేక మహోత్సవాలకు ఘన ఆహ్వానం

**గూడూరు,ఆగస్టు03(పల్లె సాక్షి ప్రతినిది :** ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రసిద్ధ శ్రీ శ్రీ శ్రీ ధర్మరాజస్వామి వారి దేవస్థానంలో నూతన రాజగోపుర శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాల వివరాలు పై గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ సూచనల మేరకు దేవస్థాన చైర్మన్ వాటంబేడు శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో మహోత్సవాల వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ, ఆగస్టు 15 నుంచి 17, 2026 వరకు శ్రావణ శుద్ధ తృతీయ నుండి సోమవారం వరకు మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నూతన రాజగోపుర శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆగస్టు 15 (శనివారం) సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అజస్త్ర దీపారాధన, దీక్షాస్వీకరణ, మత్స్యసంగ్రహణ, అంకురారోపణ, వాస్తుపూజ, ప్రధానాగ్ని ప్రణయనం, వాస్తు హోమం, తీర్థప్రసాద గోష్టి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆగస్టు 16 (ఆదివారం) ఉదయం 8.30 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్నిధ్యానం, ఉక్తహోమం, శిఖరాలకు అక్షున్మోచనం, పంచగవ్యారాధన, క్షీరాధివాసం, జలాధివాసం, అధివాస హోమాలు, కుంభపూజ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం (ఊరేగింపు), ప్రభూత బలి, అనంతరం విశేష హోమాలు, మహాశాంతి హోమం, హౌత్రం, శిఖరాలకు ధాన్య, శయనాధివాస కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆగస్టు 17 (సోమవారం) ఉదయం 7.20 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్నిధ్యానం, ఉక్తహోమం, విశేష మూలమంత్ర హోమం, గర్తపూజ, రత్నన్యాసం, ధాతున్యాసం, యంత్రన్యాసం అనంతరం ఉదయం 11.31 గంటలకు శుభముహూర్తంలో నూతన రాజగోపుర శిఖర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలశావాహనం, బ్రాహ్మణ, గో, కన్యా, అగ్నిదర్శనం, ప్రథమార్చన, సర్వదర్శనం, మహదాశీర్వచనం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు శ్రీ శివ లలిత భారత నాట్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో భరతనాట్య సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మహోత్సవాలకు గూడూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని దేవస్థాన చైర్మన్ వాటంబేడు శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముసుమూరు రవికృష్ణ , (కార్యనిర్వహణఅధికారి) పాలక మండల సభ్యులు (యు.లక్ష్మణరావు, వై.విజయ్, తదితరులు పాల్గొన్నారు.



# నారా లోకేష్ రాజీనామా చెయ్యాలి

కాకాణి గోవర్ధన్ రెడ్డి పర్వతరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్

బూదురు గురవయ్య ఆధ్వర్యంలో డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సమావేశం

**గూడూరు,ఆగస్టు03(పల్లె సాక్షి ప్రతినిది) :** డీఎస్సీలో జరిగిన అవకతవకలపై బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని మాజీ మంత్రి మరియు వైకాపా జిల్లా అద్యక్షుడు కాకాణి గోవర్దన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని పీ.వీ.ఆర్ కల్యాణ మండపంలో వైకాపా అద్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. డీఎస్సీ స్కాం బాద్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ... గూడూరు పట్టణంలోని పీ.వీ.ఆర్ కల్యాణ మండపంలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్య అద్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు తరలి రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతుందంటూ ఆంక్షలు విధించడంతో పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుండి పీవీఆర్ కల్యాణ మండపానికి చేరుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి నాయకులు క్రేన్ సాయంతో భారీ గజమాలను వేసి ఘన స్వాగతం పలికారు. కల్యాణ మండపంలో జ్యోతిప్రజ్వలన గావించారు.వైఎస్సార్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి మాట్లాడుతూ..గూడూరులో సభను అడ్డుకోవాలని పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలుస్తోందన్నారు. జగన్ పేరు చెబితేనే వ్యవస్థలు వణికిపోతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు.తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు ఇవ్వకుండా తక్కువ మొత్తంలో జమ చేశారని,ఆ మొత్తం సొమ్ము ఎక్కడికి వెళ్ళిందని ప్రశ్నించారు. డీఎస్సీలో జరిగిన అవకతవకల కారణంగా యువత పెద్ద ఎత్తున నష్టపోయిందని, డీఎస్సీ స్కాం కు బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని కాకాణి డిమాండ్ చేశారు. టీచర్ ఎమ్మెల్సీ మరియు నెల్లూరు సిటీ ఇంచార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు అన్యాయం చేస్తూ డీఎస్సీలో అక్రమాలకు చోటు కల్పించి బాధితులకు తీవ్ర ఆవేదన మిగిల్చారని, దీనికి కారణమైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఇంకా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త బూదూరు గురవయ్య,సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, నాయకులు ఎద్దల నరేంద్ర రెడ్డి,కోడూరు కల్పలత, నాశిన నాగులు, మీరారెడ్డి,సునీల్ రెడ్డి,బత్తిని విజయకుమార్, బోమిడి శ్రీనివాసులు,మగ్దూం మొహిద్దీన్,అజీజ్ ఖాన్,గిరిబాబు,తదితరులు పాల్గొన్నారు.









## ఆగస్టు 7న జరిగే ‘నేతన్న సేవ’ కార్యక్రమాన్ని

# విజయవంతం చేయాలి

## అర్హులైన ప్రతి నేతన్నకు పథకం అందేలా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే షాజహాన్ భాషా

**మదనపల్లె, ఆగస్టు 3: (పల్లె సాక్షి జిల్లా ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ‘నేతన్న సేవ’ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాషా సూచించారు. ఈ మేరకు నీరుగట్టువారిపల్లిలోని మాస్టర్ వీవర్స్‌తో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యక్రమ నిర్వహణ, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చేనేత రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ‘నేతన్న సేవ’ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి నేతన్నకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అర్హుల జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అర్హత కలిగిన ఒక్క నేతన్న కూడా పథకానికి దూరం కాకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి చేనేత కుటుంబానికి పథకం వివరాలు చేరేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మాస్టర్ వీవర్స్ తమ సమస్యలు, అవసరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని ఓపికగా విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని ప్రతి అర్హుడికి చేరవేయడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ సమావేశంలో నీలకంఠ, కమలామరి కృష్ణ, మోడం సిద్ధప్ప, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి, కేవీ నాగరాజు, రమేష్ రెడ్డి, పవన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఊట్లవారిపల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను

# పరిశీలించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలి

లడ్డూ ప్రసాదం తయారీ, నాణ్యతను స్వయంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

**పాకాల, ఆగస్టు 03: (పల్లె సాక్షి ప్రతినిధి):** పాకాల మండలం ఊట్లవారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి 78వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పురోగతిని అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... “బ్రహ్మోత్సవాలకు సమయం దగ్గర పడుతున్నందున ఆలయంలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, క్యూలైన్లు మరియు ఇతర ప్రాథమిక మౌలిక సౌకర్యాలను పక్కాగా సమకూర్చాలన్నారు. బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం, ఆలయంలో భక్తులకు పంపిణీ చేయనున్న లడ్డూ ప్రసాదం తయారీ విధానం, ప్రసాదం నాణ్యత మరియు పరిశుభ్రత ఏర్పాట్లను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఈవో, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



# మన సంప్రదాయం మన రుచి మన వంటలతో మన ఆరోగ్యం

ఫెస్టివల్ కాంబో బాక్స్, బల్క్ ఆర్డర్స్, కస్టమైసేడ్ గిఫ్ట్స్ .

మన భార్గవి వద్ద అందుబాటులో కలవు

**తిరుపతి, ఆగస్టు (పల్లె సాక్షి ప్రత్యేక ప్రతినిధి):** మన సాంప్రదాయం మన రుచులతో మన వంటకాలతో మనకు ఆరోగ్యకరంగా ఉండే విధంగా అనేక రకంగా వంటకాలు మనకు అందుబాటులో కి మీ భార్గవి తీసుకోవచ్చారు . శనివారం స్థానిక ఓల్డ్ డియర్ మహల్ రోడ్ లో గల వివాహ భోజనం హోటల్ పైన ఏర్పాటుచేసిన దేవజామి వంటశాల స్వీట్స్ అండ్ శావరీస్ వారు తయారు చేసిన వంటకాలతో మన ఆరోగ్యానికి ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను మనకు మన భార్గవి అందుబాటులోకి తీసుకొచ్చి అందిస్తున్నారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన అనే ప్రతి ఒక్కరికి ఆరోగ్యకరమైన వంటకాలను అన్ని రుచులతో అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. అలాగే మన సాంప్రదాయం మన రుచులు అంటే మన వద్ద లభించే ప్రతి వంటకాలు ఆనాటి సాంప్రదాయాల ప్రకారం కట్టెల పొయ్యిలో వండించడం అంతకముందు మన వంటకాలకు కావలసిన పప్పు దినుసులు ఆర్గానిక్ ఎరువులతో పండించి అలాగే వాటిని మనుషులు చేత తప్పించి రుచికరంగా ఆర్గానిక్ ఎరువులతో పండించిన పప్పు దినుసులు నువ్వులు శనగలు వంటి వాటితో అలాగే బెల్లం ముద్దలతో చేసిన తీపి వంటకాలతో నేడు డయాబెటిస్తో ఉన్న పేషంట్ల సైతం ఈ తీపి వంటకాలను తినవచ్చు అలాగే ఆర్గానిక్ ఎరువులతో పండించిన నిమ్మ మరియు మామిడి పండ్లతో అనేక రకాల పచ్ఛళ్లను తయారుచేసి వాటికి మిశ్రమంగా మన దంపుడు కారప్పొళ్ళు తో చేసిన ఊరగాయాల పచ్ఛళ్లను అలాగే పప్పుల పొడులను పలు రకాల వంటకాలను మనకు మనవాళ్లకు అందరికీ అందిస్తున్నారన్న సంతోషాన్ని వ్యక్తం చేశారు . అలాగే మనం వంటకాలు మనక అందుబాటులో కలవు ఈ నెంబర్కు 9 6 5 2 8 4 2 4 7 3 సంప్రదించి మీ ఆర్డర్లతో మీ ఇంటి వద్దకే మన వంటలు ఈ సదవకాశాన్ని మన అందరం వినియోగించుకుందామని మీ శ్రేయస్సు కోరే మన భార్గవి కోరుకుంటున్నానని తెలిపారు.



## హైర్ బస్సుల నిర్లక్ష్యం..,ప్రభుత్వానికి చెడ్డపేరు..

# ప్రయాణికులకు నరకయాతన

గూడూరు పాత బస్టాండ్‌లో ఆగని వెంకటగిరి డిపో హైర్ బస్సులు.. ప్రశ్నించిన వారిపై డ్రైవర్ల దురుసు ప్రవర్తన

ప్రశ్నించిన వారిపై డ్రైవర్ల దురుసు వైఖరి.. “ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి” అంటూ వ్యాఖ్యలు

ప్రభుత్వానికి అద్దె తీసుకుంటూ ప్రజా సేవలో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు

రవాణా శాఖ ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని ప్రయాణికుల డిమాండ్

**గూడూరు,ఆగస్టు03(పల్లె సాక్షి ప్రతినిది) :** ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించాల్సిన ఆర్టీసీ హైర్ బస్సులు ప్రస్తుతం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గూడూరు పాత బస్టాండ్ వద్ద నెల్లూరు వైపు వెళ్లే వెంకటగిరి డిపోకు చెందిన హైర్ బస్సులు అధికారికంగా ఆగాల్సిన బస్టాప్‌లో ఆగకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం, బస్సులు అధికారిక బస్టాప్‌కు కొంత దూరంలో ముందుగానే ఆపి కొందరు ప్రయాణికులను దింపి, వెంటనే అక్కడి నుంచి బయలుదేరిపోతున్నాయి. అయితే బస్టాప్‌లో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులను మాత్రం ఎక్కించకుం డా వెళ్లిపోతుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ ఇదే పరిస్థితి నెలకొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బస్సు ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించిన ప్రయాణికులపై కొందరు డ్రైవర్లు దురుసుగా ప్రవర్తిస్తూ, “ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి” అంటూ అనుచితంగా మాట్లాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించాల్సిన సిబ్బంది ఇలాంటి వైఖరి అవలంబించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.ఈ పరిస్థితి కారణంగా ఉద్యోగాలకు వెళ్లే వారు ఆలస్యమవుతున్నారు. విద్యార్థులు కళాశాలలకు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు ఎండలో గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ప్రజలకు సేవ చేయాల్సిన హైర్ బస్సులు కనీస బాధ్యతను కూడా నిర్వర్తించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన రవాణా సేవలు అందించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే, కొందరు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తోందని ప్రజలు అంటున్నారు. ఇటువంటి ఘటనలు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు.



హైర్ బస్సుల నిర్వహణలో ప్రైవేట్ యాజమాన్యాల నిర్లక్ష్యం ప్రభుత్వానికే చెడ్డపేరుగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని అద్దె ప్రాతిపదికన నడుస్తున్న ఈ బస్సులు ప్రయాణికులను ఎక్కించకుండా ఖాళీగానే తిరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ నెలనెలా ప్రభుత్వం నుంచి అద్దె మొత్తాన్ని పొందుతున్నారని, ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారిక బస్టాప్‌ల వద్ద ఆగకుండా, ప్రయాణికులను ఎక్కించకుండా వెళ్లిపోవడం వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందని, ప్రజల విశ్వాసానికి భంగం కలుగుతోందని పలువురు పేర్కొంటున్నారు. హైర్ బస్సుల నిర్వహణపై రవాణా శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలు, డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడం సంబంధిత అధికారుల బాధ్యత. గూడూరు పాత బస్టాండ్‌లో నెలకొన్న ఈ సమస్యపై ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి హైర్ బస్సుల నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

APTEL 2022 / 16169
పల్లె సాక్షి
కర్నూలు నంద్యాల

### పాలిటెక్నిక్ కళాశాలలో ఆగస్టు 5వ తేది

# స్పాట్ అడ్మిషన్లు

**జీవి రమణ రెడ్డి**



**బనగానపల్లె ఆగస్టు 3 పల్లె సాక్షి** బనగానపల్లె మండలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పాలిటెక్నిల్ కళాశాలలో అడ్మిషన్స్ కొరకు మొదటి మరియు రెండవ ఫేస్ కౌన్సిలింగ్ పూర్తి చేయడం జరిగింది.కౌన్సిలింగ్ తరువాత కళాశాల లో మిగిలిపోయిన సీట్ల భర్తీ చేయుట కొరకు స్పాట్ అడ్మిషన్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని కావున ఆగస్టు 5వ తేదీన ఉదయం 9 గంటలకు బనగానపల్లె పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడంజరుగుతుంది.కావున ఆసక్తి గల యువతి,యువకులు కళాశాలకు వచ్చి సంప్రదించగలరని కళాశాల ప్రిన్సిపాల్ జివి రమణ రెడ్డి తెలిపారు.బనగానపల్లె వాసవి పాలి పెన్నిక్ నందు ఎలక్ట్రికల్ ఇంజనిరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ మరియు సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల నందు సీట్లు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగింది.అలాగే కళాశాల లో హాస్టల్ వసతి కలదు అని అన్నారు.దివంగత మాజీ గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య స్థాపించిన ఈ సంస్థ పేద బడుగు బలహీన వర్గాల వారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు..

### డిఎస్సి అక్రమాల పై వైఎస్సార్సీపీ పార్టీ టౌన్ సమావేశాన్ని

# మాజీ ఎమ్మెల్యే కాటసాని



**బనగానపల్లె ఆగస్టు.3 పల్లె సాక్షి :** మండల కేంద్రమైనా బనగానపల్లెలో సోమవారం రాష్ట్ర వైఎస్సార్సీపీ కార్యాలయ ఆదేశాల మేరకుబనగానపల్లె వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయం నందు ఋజ అక్రమాల పై వైఎస్సార్సీపీ పార్టీ టౌన్ సమావేశాన్ని నిర్వహించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధగా ఋజ అక్రమాలకు నిరసనగా విద్యాశాఖ మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేసిన. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఈ నెల 6,7,8,9 తేదీలలో నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ర్యాలీలు. ఈ నెల 10 వ తేదీన కోవెలకుంట్ల మండల కేంద్రంలో భారీ ర్యాలీ ఈకార్యక్రమంలోవైఎస్సార్సీపీ నాయకులు కర్రా హర్షవర్ధన్ రెడ్డి,గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, అత్తర్ జాహిద్ హుస్సేన్, బీవీ నాగార్జున రెడ్డి,సన్నల జనార్ధన్ రెడ్డి,అంబటి రవి రెడ్డి,జిల్లెళ్ళ శంకర్ రెడ్డి,శ్రీనివాస నాయక్,ఈశ్వర్ నాయక్,దండు మధు, సురేష్ కుమార్,సుబ్బు తల్లం, గులంనాభిపేట రఘు రెడ్డి,రాంభూపాల్ రెడ్డి,జస్వంత్ రెడ్డి, జిటి వెంకటరామిరెడ్డి,తోట బుచ్చిరెడ్డి,నీలి శ్రీనివాసులుమెకానిక్ అబెద్, మూర్తుజ హుస్సేన్, చెర్వుపల్లి పుల్లయ్య,వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నార

### ఆలయాల్లో ఉచిత సాంస్కృతిక శిక్షణ కేంద్రాలు

# ఏర్పాటు చేయాలి

**కళాకారుల ఎంపికలో పారదర్శక విధానం అమలు చేయాలని 'జనతా వారధి' వినతి**



**రాజమహేంద్రవరం ఆగస్టు0 3సూర్య న్యూస్:** దేవాలయాలను సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళల పరిరక్షణకు కేంద్రాలుగా తీర్చిదిద్దాలని బీజేపీ జనతా వారధి బృందం ప్రభుత్వాన్ని కోరింది. దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో దశలవారీగా ఉచిత సాంస్కృతిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, టిటిడితో పాటు రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో సాంస్కృతిక ప్రదర్శనల ఎంపికకు పారదర్శక విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లో జనతా వారధి కో-కన్వీనర్ యానాపు ఏసు, బండి సత్య ప్రసాదు, యేరువ మీనాక్షి రెడ్డి, వివిధ కళాకారుల సంఘాల ప్రతినిధులు విభూతి రాంప్రసాద్, విభూతి శాంతారాం, విభూతి శ్రీనివాసరాజు, రాలి పైడిరాజు, పసుపురెడ్డి గోవిందు, పవురోజు ఆనందసాగర్, యడవల్లి తిరుపతిరావు, సీతారాం చీర్ల తదితరులు వినతిపత్రం అందజేశారు.రాష్ట్రవ్యాప్తంగా భజన సంఘాలు, కోలాట బృందాలు, హరికథకులు, జానపద కళాకారులు తదితర సంప్రదాయ కళాకారుల నమోదు చేపట్టి, జిల్లా స్థాయి కమిటీల ద్వారా అర్హతలను పరిశీలించి డిజిటల్ డేటాబేస్ రూపొందించాలని కోరారు. ఆలయాల్లో ప్రతిరోజూ కనీసం గంటపాటు భజన, కోలాటం, చెక్కభజన, హరికథ, యక్షగానం, పురాణ ప్రవచనం, నాదస్వర సంగీతం వంటి కళారూపాల్లో శిక్షణ నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన స్థానిక కళాకారులను పార్ట్‌టైమ్ శిక్షకులుగా నియమించి గౌరవప్రదమైన పారితోషికం అందించాలని, శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలు, ఆలయ ఉత్సవాల్లో ప్రదర్శన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో కళాకారులకు సమాన అవకాశాలు లభించడంతో పాటు ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పెరిగి, కొత్త ప్రతిభావంతులకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.

### దళిత మహిళపై దాడి ఘటనను ఖండిస్తూ

# ఎమ్మెల్యే వీరపాక్షికి కఠిన శిక్షలు విధించాలి

**టీడీపీ మండల ఉపాధ్యక్షులు నల్లమల్ల విజయ్ కుమార్ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల కోడిగుడ్ల యేసేపు డిమాండ్**



**పెద్దకడబూరు :ఆగష్టు 03 (పల్లెసాక్షి ):** ఆలూరు నియోజకవర్గంలోని నేమకల్లు గ్రామంలో ఇటీవల దళిత మహిళపై జరిగిన దాడి సభ్య సమాజాన్ని తలదించుకునే ఘటన అని,కులం పేరుతో దూషించడం, అవమానించడం అత్యంత ఖండనీయమని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి కోడిగుడ్ల యేసేపు,మండల ఉపాధ్యక్షుడు ఎన్. విజయకుమార్ పేర్కొన్నారు.సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ,బాధిత మహిళకు అండగా నిలవడానికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలపై దాడి చేయడం, వారి వాహనాలను ధ్వంసం చేయడం వైసీపీ నాయకుల రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు.గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటిలోకి ప్రవేశించి దళిత మహిళపై దాడి చేయడంతో పాటు ఆమె పట్ల అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టం సహా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యే వీరపాక్షిని పదవి నుంచి భర్తరఫ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఇలాంటి ఘటనలను ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించరాదని, బాధిత మహిళకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### (డిఎస్సీ) అక్రమాల పై (సీబిఐ)తో

# విచారణ జరపాలి..

**వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి**

**కోసిగి రూరల్ టుడే ( పల్లె సాక్షి ) ఆగస్టు 03 :** డిఎస్సీ లో జరిగిన అక్రమాలపై సీబిఐతో విచారణ జరపాలని వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల





పరిధిలోని రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయి లో టౌన్ హాల్ మీటింగ్ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఏపీ డిఎస్సీ అక్రమాలపై వైఎస్సార్సీపీ పోరాటం లో భాగంగా 6 నుంచి 9 వరకు నియోజకవర్గాల్లో రిలే నిరాహార దీక్షలు, 10 వ తేదిన నియోజకవర్గం కేంద్రం లో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ కార్యక్రమాలు ఉంటాయని కావున ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు... ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి కాకుండా వైఎస్సార్సీపీ నేత ల పై అక్రమ కేసులు పెట్టడం సరికాదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యులు / ఆదోని అసెంబ్లీ పరిశీలకులు ఆర్. పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్సీపీ నేత లు సి. వి. విశ్వనాథ్ రెడ్డి, మురళీ మోహన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ప్రహ్లద స్వామి తో పాటు ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 5న కేతవరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి

# ఆలయ భూములకు బహిరంగ వేలం

**బెల్లంకొండ ఆగస్టు 3,పల్లె సాక్షి,** మండలంలోని కేతవరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములకు 11 సంవత్సరాల కౌలుకు ఈనెల 5వ.తేదీన ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఈ-టెండర్,కం, సీల్డ్-టెండర్ విధానంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మండల దేవాదాయ శాఖ అధికారి ఎస్. కోటిరెడ్డి తెలిపారు.దేవాదాయ శాఖ ఉప కమిషనర్ సమక్షంలో ఈ వేలం పాట నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు.2026-27 నుండి 2036- 37 వరకు మొత్తం 11 సంవత్సరాల కాలానికి కౌలు హక్కులను వేయనున్నట్లు తెలిపారు.వేలంలో పాల్గొనదలచిన వారు ప్రతి ప్లాటుకు రూ.25 వేలు డిమాండ్ డ్రాఫ్ట్(డి.డి)ను శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కేతవరం పేరున చెల్లించి ఈ- టెండర్ ,కం,సీల్డ్- టెండర్ లో పాల్గొనాలని కోరారు.మరిన్ని వివరాలకు 9949491918 నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

# మితిమీరిన వేగం.. తప్పిన ప్రమాదం..!

**మహానంది, ఆగస్టు 03, పల్లె సాక్షి:** గ్రామాల్లో నెమ్మదిగా వెళ్ళండి అంటే మరింత వేగం పెంచి వరుస ప్రమాదాలకు గురి చేస్తున్న టిప్పర్లు. మహానంది మండలం అల్లినగరం గ్రామంలో సోమవారం



తెల్లవారుజామున మండలంలోని బసవాపురం గ్రామం నుండి నూతన హైవేకు గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు అతివేగంతో మరో టిప్పర్ను ఢీ కొట్టి గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై ఎక్కించి గాయప రిచినట్లు స్థానికులు తెలుపుతున్నారు. పలుమార్లు చెప్పిన నిదానంగా వెళ్లండి అంటే మరింత వేగాన్ని పెంచి మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానిక గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ఏపీడబ్ల్యూజేఎఫ్ మహాసభల హాజరుకావాలని

# మంత్రి బీసీకి ఆహ్వానం

**బనగానపల్లె,ఆగస్టు,03,పల్లెసాక్షి** మండలంలో ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ అన్నమయ్య జిల్లా మొదటి మహాసభలకు హాజరుకావాలని అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బీసీ జనార్ధన్రెడ్డి బనగానపల్లెలో



ఆయన స్వగృహం నందు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులుఆహ్వానించారు .ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్చార్జ్ కవరకుంట్ల జయరాజ్,అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ రాయల్, హిదాయతుల్లా అప్ప, ఏపీబీజేఏ అధ్యక్షులు రెడ్డి ప్రసాద్, నంద్యాల జిల్లా కన్వీనర్ మద్దయ్య యాదవ్, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు షేక్ సలీం బాషా, శ్రీనివాసులు నాయుడు, జాకీర్ హుస్సేన్, మంజునాథ్, బనగానపల్లె నియోజకవర్గ కార్యదర్శి షాషావలి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి అన్నమయ్య జిల్లా మొదటి మహాసభకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

# దళిత కాలనీలో సమస్యలు పరిష్కారంలో విఫలం

## అధికారులుకు ముడుపులు చెల్లిస్తేనే పనులు..!!

**కులవివక్షవ్యతిరేకపోరాట సంఘం ( కెవిపిఎస్ )వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముట్టడి ..దళితులపై వివక్షత ఎందుకు...!!**

**పెద్దకడబూరు ఆగస్టు:03 (పల్లెసాక్షి):** పెద్దకడబూరు మండలంలోని చిన్నతుంబలం బసలదొడ్డి,హెచ్.మురవని దళితవాడలో నివసించే దళితుల సమస్యలు పరిష్కరించా లంటూ వ్యవసాయ కార్మిక సంఘం ,కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈ తిక్కన్న,దేవదాసు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి హనుమంతు,సిపిఎం పరమేష్,ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ను సోమవారం ముట్టడించడం జరిగింది. అనంతరం వారు ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దళితులు నివాస కాలనీలలో సామాజిక శాఖారావం ఆధ్వర్యంలో చేపట్టినటువంటి అధ్యయన యాత్రల ద్వారా సర్వే నిర్వహించడం జరిగింది. స్వాతంత్రం వచ్చిన నేటికీ దళితులు అనేక సమస్యలతో బాధపడుతున్నారు .ప్రభుత్వ అధికారులకు ప్రజా ప్రతినిధులకు అనేకసార్లు ప్రజల సమస్యలను విన్నవించిన ప్రయోజనం లేదు అందువల్ల కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దాదాపు 15 రోజులు పాటు గ్రామాల్లో దళితులకు ఎదుర్కొంటున్నటువంటి ముఖ్యమైన సమస్యలును గుర్తించి చిన్న తుంబలం గ్రామంలో దళితులకు స్మశాన వాటిక ఉంటే దాన్ని కూడా టిడిపి నాయకులు కబ్జా చేయడం జరిగిందని తెలిపారు.దళితులకు స్మశాన వాటిక స్థలాలు లేక తీవ్ర




ఇబ్బందులు పడుతున్నారు.బసలదొడ్డి గ్రామంలో ఉన్న స్మశానవాటికలకు కనీస వసతులు కరువయ్యాయి.హెచ్ మురవని గ్రామంలో దళిత స్మశాన వాటికలో పూడ్చిన శవాన్ని పైనే శవాన్ని పెట్టాల్సిన పరిస్థితి అక్కడ ఏర్పడిందని కనీసం ప్రభుత్వ అధికారులకు ఈ సమస్య పట్టదాని ప్రభుత్వ పాలకులపై మండిపడ్డారు.అలాగే గ్రామాలలో త్రాగునీటిలో ఫ్లోరైడ్ ఉండడం వల్ల ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రతి దళిత గ్రామంలో త్రాగునీరు రోడ్లు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలిని దళితులను నేటికీ రచ్చబండ కట్టలపై కూర్చోనీయకుండా ఉండడం గ్రామీణ ప్రాంతాల్లో రెండు గ్లాసుల పద్ధతి ఇంకా కొనసాగుతూ ఉందని ఇలాంటి కుల వివక్షను అధికారులు వెంటనే ఇలాంటి వారి పైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు .అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో దళితవాడలో నివసించేటువంటి భూమి లేనటువంటి దళితులకు రెండు ఎకరాలు చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేసి దళితులకు భూ పంపిణీ చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దళితులకు ల్యాండ్ సీలింగ్ భూములు ఉన్నటువంటి వాళ్లకు రైతు భరోసా అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని వారు అన్నారు.దళితులను ఆలయ ప్రవేశానికి చట్టబద్ధత కల్పించి దళితుల పట్ల వివక్షతను రూపుమాపాలని వారు డిమాండ్ చేశారు ధర్నానంతరం తాసిల్దార్ వలిభాష కు పలు సమస్యలతో కూడినటువంటి వినతి పత్రాన్ని వారు అందజేశారు .తక్షణమ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బొగ్గుల విల్సన్,డివైఎఫ్ఐ నాయకులు జగతప్ప రాజు, నాగిరెడ్డి,కెవిపిఎస్ నాయకులు వివిధ గ్రామాల దళిత కాలనీ వాసులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

APTEL 2022 / 16169
టుడే పల్లె సాక్షి
కర్నూలు
నంద్యాల

## ఎల్ నినో ప్రభావంపై గ్రామ రైతులకు...

# అవగాహన కార్యక్రమం

**ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన నంద్యాల శాస్త్రవేత్తలు డాక్టర్ : యం.శివరామకృష్ణ డాక్టర్ : ఎస్.ఐషా పర్వీన్**

**జిల్లా వ్యవసాయ అధికారిని ఎస్.రమాదేవి, మండల వ్యవసాయధికారులు సుచరిత,యం. వరప్రసాద్, మండల వ్యవసాయధికారులు గ్రామ రైతులకు సలహాలు**

**పెద్దకడబూరు ఆగష్టు 03 (పల్లెసాక్షి):** ఆదోని డివిజన్లోని పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాలలో ఎల్లినో ప్రభావం మీద అవగాహన సమావేశాలు నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా సోమవారం దొడ్డి వేకల, హెచ్. మురవణి, జాలవాడి, కమ్మలదిన్నె, వీకల బెట్ట,గవిగట్టు గ్రామాలలో మరియు కోసిగి మండలంలోని వందగల్లు వంటి తీవ్ర ఎల్లినో ప్రభావాన్ని ఎదుర్కొంటున్నట్లు ప్రకటించబడిన గ్రామాల్లో వివిధ పంటలను సందర్శించి రైతులతో ముఖాముఖి చర్చించడం జరిగిందని వారు తెలిపారు.వర్షాలు ఆలస్యమైన ఈ సమయంలో ఏ,ఏ పంటలను వేసుకోగలము అనే అంశాలపై రైతులను సన్నద్ధం చేయడం జరిగింది.ఆగస్టు చివరి వారం వరకు వర్షాలు ఆలస్యం అయితే తక్కువ కాల పరిమితి కలిగిన పంటలైన










అలసందలు,పెసలు,జొన్నలు,సజ్జలు,కొర్రలు, రాగులు వంటి చిరుధాన్యాలని మరియు పప్పు ధాన్యాల పంటలను వేసుకొని రైతులు తమ పొలాలను ఖాళీగా ఉంచకుండా తదుపరి రబీలో సన్నద్ధమవ్వాల్సిందిగా కోరడం జరిగినది.ప్రస్తుతం పొలాల్లో ఉన్నటువంటి పత్తి,మిరప,ఉల్లి మరియు వేరుశనగ వంటి పంటలలో వివిధ సమస్యలపై చర్చించడం జరిగింది.పత్తిలో మెగ్నీషియం సల్ఫేట్ 1 % వంటి మందులను ఆకులపై పిచికారి చేసి మెగ్నీషియం పోషక లోపాన్ని నవరించుకోవలసినదిగా రైతులకు తెలియజేయడం జరిగింది.వర్షం రాక పంట గెడస బారి ఉన్నచోట పంట కీలక దశల్లో ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని 5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి ఒక ఎకరా కి పిచికారి చేయాలి.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానము నంద్యాల శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. శివరామకృష్ణ,డాక్టర్ ఎస్.ఐషా పర్వీన్ మరియు ఎస్.రమాదేవి,కెవికె బనవాసి, శాస్త్రవేత్త డాక్టర్ టీ.శ్రీచందన,మండల వ్యవసాయ అధికారులు జి.సుచరిత మరియు ఎం.వరప్రసాద్ మరియు ఆర్ బి కే సిబ్బంది మరియు గ్రామాలలో ఉన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే

# ప్రభుత్వ ధ్యేయం..!

**ప్రతి వినతిపై నిర్దేశిత గడువులో నాణ్యమైన చర్యలు తీసుకోవాలి**

**అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని**

**అధికారులకు ఆర్డీవో కె. అరుణ దేవి ఆదేశం**

**పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆదోని ఆర్డీవో**

**పెద్దకడబూరు ఆగష్టు 03 (పల్లెసాక్షి):** ప్రజల సమస్యలను పారదర్శకంగా, జాప్యం లేకుండా,నాణ్యతతో పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆదోని రెవెన్యూ







డివిజనల్ అధికారి (ఆర్డీవో) కె.అరుణ దేవి తెలిపారు.సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఆర్డీవో నేరుగా స్వీకరించారు.అర్జీదారులు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, వారి సమస్యలను ఓపికగా విన్న అనంతరం సంబంధిత శాఖల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీ వెనుక ఒక కుటుంబం ఆశలు, అవసరాలు, సమస్యలు ఉంటాయని గుర్తించి, వాటిని నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం, అలసత్వం, నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదన్నారు. కార్యక్రమంలో భూ వివాదాలు,రెవెన్యూ సంబంధిత సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్స్,వారసత్వ మార్పులు, భూముల రికార్డుల సవరణలు,సామాజిక భద్రతా పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన పలు వినతులను ప్రజలు సమర్పించారు.ప్రతి వినతిని సంబంధిత శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించి,నిర్దేశిత గడువులో నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆర్డీవో స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. సమస్యలను పరిష్కరించడంలో కేవలం నివేదికలు పంపడమే కాకుండా,అర్జీదారుడు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా ఫలితాధారిత చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకమైన సేవలు అందించాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రభావవంతమైన వేదికగా నిలుస్తోందని, ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆర్డీవో తెలిపారు. ప్రజల వినతులను సానుకూల దృక్పథంతో స్వీకరించి, శాఖల మధ్య సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు,వివిధ శాఖల జిల్లా,డివిజన్ స్థాయి అధికారులు,సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల చలో విజయవాడను

# జయప్రదం చేయండి

**ఎమ్మిగనూరు : ఆగస్టు 3 పల్లె సాక్షి :** విద్యుత్ కార్మికుల చలో విజయవాడ ఆగస్టు 10 ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు యునైటెడ్



ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భీమేష్ విద్యుత్ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం సిఐటియు ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి రాముడు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ విజన్ అధ్యక్షులు జావిద్ జేఎల్ఎం-2 డివిజన్ నాయకులు నాగన్న తో కలిసి సిఐటియు కార్యాలయంలో చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ కార్మికులు ఎన్నో కష్టాలు భరించి ఐదు కోట్ల మంది ప్రజలకు పరిశ్రమలకు వ్యవసాయ రంగానికి విద్యుత్ అందిస్తున్నారని విపత్తులు సంభవించినప్పుడు రాత్రి అనకా పగలనకా కష్టపడి పనిచేస్తున్నప్పటికీ ఉద్విత ఉద్యోగులు కార్మికుల సమస్యలు పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని అన్నారు. విద్యుత్తు ఉద్యోగులు కార్మికులు సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. 12వ పిఆర్సి ని వెంటనే ప్రకటించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు . కాంట్రాక్ట్ కార్మికులకు 48 వేల రూపాయలు వేతనం చెల్లించాలని కోరారు. విద్యుత్ కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు . విద్యుత్ సంస్థలో ఖాళీ గా ఉన్న పోస్టులను సంస్థలో ఇప్పటికే పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వము ఇస్తున్నవిధంగానే విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కార్మికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. స్టోర్ హ మాలీలకు ఎస్ఎస్ఆర్ రేట్లు అమలు చేయాలని కోరారు. హమాలీలకు ఈఎస్ఐ పీఎఫ్ చెల్లించాలని ఓపెన్ టెండర్ విధానం రద్దు చేయాలని కోరారు .ఆపరేటర్లకు ఇస్తున్న వేతనాలలో వ్యత్యాసాన్ని సరిచేసి అందరికీ సమాన వేతనం చెల్లించాలని కోరారు. 2019 తర్వాత చేరిన కార్మికులకు జీవో నెంబర్ 129 అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధన కోసం జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలని కార్మికులకు వారు పిలుపునిచ్చారు

## కాలువలు శిథిలం...

# సాగునీరు ప్రశ్నార్థకం...

**ఉయ్యాలవాడ, ఆగస్టు 3:( టుడే పల్లె సాక్షి)** ఉయ్యాలవాడ మండలంలో కేసీ కెనాల్ కు అనుసంధానంగా హరివరం ఛానల్ పరిధిలో నిర్మించిన పంట కాలువలు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం కాలువలకు అమర్చిన సైడ్ స్లాబ్ పలకలు ఊడిపోతున్నాయి. జిల్లా కలెక్టర్ ఇటీవల ఆగస్టు చివరికి కాలువల అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేసీ కెనాల్ అధికారులు ఇంతవరకు ఎటువంటి




చర్యలు చేపట్టలేదు. కాలువల పరిధిలోని ఆయకట్టు పొలాలకు ఈ ఏడాది సాగునీరు ప్రశ్నార్థకంగా మారనుంది. హరివరం ఛానల్ పరిధిలో పడిగెపాడు, నర్సిపల్లె, హరివరం, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులకు సంబంధించి 6 వెల ఎకరాల పొలం ఉంది. ఈ ఏడాది వర్షాలు కూడా ఇప్పటివరకు కురవలేదు. శ్రీశైలం, అవుకు రిజర్వాయర్లలో పూర్తిస్థాయిలో నీరు చేరితే మెట్ట భూములు ఆరు తడి పంటలు సాగు చేసేందుకు వీలు కలుగుతుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కాల్వ లోపలి బాగాన ఉన్న సైడ్ సిమెంట్ పలకలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# రోడ్డుకు అడ్డంగా వాహనాలు..!

**పట్టించుకోని అధికారులు**

**మహానంది, ఆగస్టు 03, పల్లె సాక్షి:** రోడ్డు కాడ్డంగా వాహనాలు నిలుపుతూ ఇతర ప్రయాణిక వాహనాలకు అడ్డంకు కల్పిస్తున్న టాటా వాటర్ ప్లాంట్ యాజమాన్యం. మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లి సమీపంలోని టాటా వాటర్ ప్లాంట్ దగ్గర రాత్రిం బగళ్లు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుతూ రోడ్డుపైనే ఉంచడం పట్ల, అందులోనూ మలుపు ఉండడం తో వాహనాలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అటుగా తిరిగే రైతులు వాహనదారులు వాపోతున్నారు. అధికారులు ఎవరు చూసి చూడనట్లు వ్యవహరించడంపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై అడ్డంగా ఇరువైపులా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ఆ పరిసర రైతులు కోరుతున్నారు.




## దళిత మహిళపై జరిగిన దాడిలో భాగంగా

## ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని వెంటనే

# బర్తరఫ్ చేయాలి

**పెద్దకడుబూరు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు గవిగట్టు మల్లికార్జున**

**పెద్దకడబూరు ఆగష్టు 03 (పల్లెసాక్షి):** ఆలూరు నియోజకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని, శాంతిభద్రతలను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని మరియు టీడీపీ



కార్యకర్తలపై జరిగిన దాడులు,మహిళలు మరియు దళితులపై దాడులు జరిగాయన్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవి.వీటిపై సమగ్ర దర్యాప్తు జరగాలి అని పెద్దకడుబూరు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు గవిగట్టు మల్లికార్జున తీవ్రంగా సోమవారం ఖండించారు.ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ ప్రజల రక్షణ బాధ్యత వహించాల్సిన ఎమ్మెల్యే స్వయంగా వందలాది మంది అనుచరులతో వెళ్లి ఉద్రిక్తతలకు కారణం కావడం అత్యంత బాధ్యతారాహిత్య చర్య.రాజకీయ భేదాలను హింసతో పరిష్కరించే ప్రయత్నం ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధం.ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి చట్టాన్ని గౌరవించకుండా వ్యవహరించారనే ఆరోపణలు ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయి.గ్రామాల్లో శాంతి నెలకొల్పాల్సిన ప్రజాప్రతినిధే రాజకీయ ఉద్రిక్తతలను పెంచే విధంగా వ్యవహరించడం దురదృష్టకరం. అధికారాన్ని ప్రజాసేవ కోసం వినియోగించాలి గానీ,రాజకీయ బలప్రదర్శన కోసం కాదు.కేసులు నమోదై, రిమాండ్‌కు వెళ్లే పరిస్థితి రావడం ఎమ్మెల్యే పదవికి మచ్చ తెచ్చే పరిణామం బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం ఎలాంటి రాజకీయ ఒత్తిడికి లోనుకాకుండా చట్టప్రకారం చర్యలు కొనసాగించాలి ఆలూరు నియోజకవర్గ ప్రజలకు శాంతి,భద్రత,ప్రజాస్వామ్య విలువలను కాపాడే నాయకత్వం అవసరం. హింసను ప్రోత్సహించే రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలి ఈ సంఘటనల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని వెంటనే ఎమ్మెల్యే పదవి నుండి బర్తరఫ్ చేయాలని,చట్టపరమైన విచారణను వేగవంతం చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు. ప్రజాస్వామ్యంలో చట్టమే పరమాధికారం. హింస, బెదిరింపులు,దాడులకు ఎలాంటి స్థానం లేదు.ప్రజల ప్రాణాలు,శాంతిభద్రతలు రాజకీయాల కంటే ఎంతో ముఖ్యమైనవి అని తెలిపారు.

# గొడ్డలి పార్టీ నాయకుల మాటలు హాస్యాస్పదం

**టిడిపి నరవ దంపతులు**

**పెద్దకడబూరు ఆగస్టు 3 (పల్లెసాక్షి ):** కూటమి పార్టీ పరిపాలనలో ప్రజాస్వామ్యం కూని అంటూ పత్రిక ప్రకటన చేయడం చాలా హాస్యాస్పదంగా ఉందని పెద్దకడుబూరులో స్థానిక టిడిపి కార్యాలయం నందు టిడిపి రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేస్తూ వైసీపీ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదివారం ప్రకటనలో ఆయన మాట్లాడిన విషయాలపై మండిపడుతూ ఆరోపించారు. వీళ్ళ మాటలు వింటుంటే దయ్యాల వేదాలు వల్లించినట్లు ఉంది.మీ పరిపాలనలో ఒక దళిత డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగినందుకు ఆయనను చిత్ర హింసలు చేసి చావుకి కారకలు మీరు కాదా? దళిత డ్రైవర్



సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసింది మీరు కాదా? బిసి విద్యార్థి అమర్నాథ్ గౌడ్ ని దౌర్జన్యాన్ని ప్రశ్నించినందుకు హత్య చేసింది మీరు కాదా? నంద్యాలలో ఒక ముస్లిం మైనారిటీ కుటుంబము ఆత్మహత్యకు కారకులు మీరు కాదా?వెలుగు చూడని ఎన్నో అక్రమాలకు పాల్పడిన మీరు ఇప్పుడు ప్రజాస్వామ్యము గురించి మాట్లాడడం చాలా హాస్యాస్పదంగా ఉంది.ఒక్కసారి గతం గుర్తు చేసుకోండి.అంబేద్కర్ రాజ్యాంగం అమల్లో ఉంది కనుకనే మీరంతా బయట స్వేచ్ఛగా ఉన్నారు.రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేసి ఉంటే మీ పరిస్థితి వేరేగా ఉండేది.వారు తెలుసుకొని మాట్లాడాలని తెలిపారు...

EDITED&PUBLISHED AND OWNED BY EDITOR:V.LINGAMURTHY. PUBLISHED AT DOOR NO:4/83,BC COLONY, KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, PINCODE:518360.MURTHY OFFSET PRINTERS D.NO:4/83,KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, CONTACT NO:9000367833.RNI,APTEL/2022/82037 E-MAIL ID:pallesakshi2022@gmail.com